క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

అరకులోయటౌన్: మండలంలోని పాని రంగిని రైల్ బ్రిడ్జి వద్ద బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. అరకులోయ నుంచి బోసుబెడ వెళ్తున్న కారు పానిరంగిని రైల్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి విశాఖ నుంచి అరకులోయకు వస్తున్న డిలక్స్ బస్సును తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో నడుపుతున్న కారు ఓనర్ క్షేమంగా బయటపడ్డాడు. స్థానికులు హుటాహుటిన కారును పక్కకు తీశారు. ఈ సంఘటనలో కారు నడుపుతున్న ఓనర్ ఒక్కరే ఉండడం, ఆయనకు ఎటువంటి గాయాలు కాలేదు.

గ్రామాల్లో తోడ పెద్దుల ఊరేగింపు


తోడ పెద్దుకు తిలకం దిద్దుతున్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: సంక్రాంతి పండుగ నేపథ్యంలో తోడపెద్దుకు విశేష పూజలు చేశారు. అప్పన్న గద్దె గల పూజా రులు తోడపెద్దను నాలుగు రోజులు గ్రామాల్లో ఊరేగించారు. ఈ విధంగా ఇంటింటికి వచ్చే తోడపెద్దును దీప దూపాలతో పూజించారు. తోటపెద్దకు పసుపు నీటితో స్నానం చేసి దీపధూపాలతో పూజలు చేశారు. పండ్లు, పిండి వంటలు తినిపించారు. నూనె వత్తులతో వెలిగించిన కోలలు వెలిగించి ఆ మంటలతో భక్తులు నృత్యాలు చేశారు.

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

దేవీపట్నం: మన పండుగలు, సంప్రదాయ, సంస్కృతులను ప్రతీ ఒక్కరూ ఆచరిస్తూ పరిరక్షించుకోవాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఇందుకూరుపేట గ్రామంలో సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు ప్రతి పండుగను మనకు సంప్రదాయబద్ధంగా అందించినట్టు చెప్పారు. మన దేశంలో ఆవిర్భవించిన యోగాను ఐదు వందల దేశాల్లో విదేశీయులు ఆచరిస్తున్నట్టు తెలిపారు. మన భారతదేశాన్ని విశ్వ గురువు అని కొనియడారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలని సూచించారు. సనాతన ధర్మ పరిరక్షణకు అందరూ ముందుకు రావాలన్నారు. రంపచోడవరం, జగ్గంపేట, రాజానగరంలో మండలాల్లో తన సేవ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. భారతీయ వైభవాన్ని తెలిపే విధంగా సనాతన ధర్మం అనే చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. సంక్రాంతి సంబరాలు కార్యక్రమం నిర్వహణకు రూ. 10 వేలు వితరణ ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. పండగ నేపథ్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మునగపాక: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మునగపాకలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు అన్ని వీధుల గుండా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పలువురు భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు.


చింతపల్లిలో గోమాతకు పూజలు చేస్తున్న ఓ గిరిజన కుటుంబం


గోవులకు ధాన్యం పెడుతున్న గిరిరైతు


జి.మాడుగులలో తోలుబొమ్మలాట ప్రదర్శన

మన్యంలో సందడే సందడి


కించాయిపుట్టులో థింసా నృత్యం చేస్తున్న గ్రామస్తులు

- గిరిజన గ్రామాల్లో ఘనంగా సంక్రాంతి వేడుకలు
- దూడూ బసవన్నలు, సేర్ బుడియాల హడావుడి
- గోవులకు ప్రత్యేక పూజలు


దుంబ్రిగుడలో థింసా నృత్యం చేస్తున్న యువతీ, యువకులు

అరకులోయటౌన్: గిరి గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా మూడు రోజులుగా గిరి గ్రామాల్లోని వాడవాడలా అంబరాన్నంటిన వేడుకలు జరిగాయి. గ్రామాల్లో థింసా నృత్యాలు, ఇతరత్రా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీధుల్లో దూడూ బసవన్నల సందడి నెలకొంది. ప్రతీ ఇంటి వద్ద వారికి స్వాగతం పలికి, బియ్యం, తోచినంత డబ్బులతోపాటు దుస్తులు పెట్టి పంపించారు. సంక్రాంతి కనుమ రోజు గిరిరైతులు తమ గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవుల పాదాలు కడిగి, బొట్టు పెట్టి ధాన్యం, బియ్యంతో పాటు కందులు, బొబ్బర్లతో తయారు చేసిన జావా తినిపించారు. యువకులు గ్రామాల్లో బుడియాలు వివిధ వేషధారణలో ఇంటింటికి తిరుగుతూ బియ్యం, డబ్బులు వసూలు చేశారు. మూడు రోజులుగా ఆనందంగా గడుపుతూ సంక్రాంతి పండుగ ముగించారు.

దుంబ్రిగుడ: మండలంలోని దుంబ్రిగుడ, అరకు, కించుమండ, గుంటసీమ, సొవ్వా తదితరు ప్రాంతాల్లో భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులుగా పండుగా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా థింసా నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం కనుమ రోజు గోవులను పూజించి, ధాన్యం, పిండివంటలు, బియ్యం, జావలను తయారు చేసి గోవులకు పెట్టారు. గ్రామాల్లో పూర్వీకుల పేరుతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ముంచంగిపుట్టు: మండల వ్యాప్తంగా సంక్రాంతి పండగ ఘనంగా జరిగింది. గిరిజన మహిళలు వాకిట్ల ముందు రంగురంగులతో ముగ్గులు వేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వస్త్రాలు ధరించి థింసా నృత్యాలు చేశారు.గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.యువత సందడి చేశారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి,బహూమతులు అందజేశారు.

జి.మాడుగుల: మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లను రంగు రంగులతో తీర్చిదిద్ది, ముంగిట ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. పండగను పురస్కరించుకొని పితృదేవతలకు నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లన్ని బంధువులు, మిత్రుల రాకతో కళకళలాడాయి. కనుమ రోజున పరిసరాలు, పశువులకు శుద్ధి చేసి, గిరిజన రైతులు కొత్త ధాన్యం, కందుల జావను అందించి పూజలు చేశారు. థింసా, సంప్రదాయ నృత్యాలతో గిరిజనులు సందడి చేశారు.

రంపచోడవరం: పల్లెలు సంక్రాంతి పండుగతో సందడిగా నెలకున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో ముగ్గులు పోటీలు జరిగాయి. బంధు, మిత్రుల రాకతో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.


చౌడుపల్లిలో భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


గ్రామంలో భోగి మంట వద్ద బుడియాల నృత్యాలు

రాజవొమ్మంగి: మండలంలో సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకున్నారు. కనుమ పండగ సందర్భంగా పశువులకు ఉదయాన్నే స్నానాలు చేయించి పసుపు కుంకుమలతో బొట్టు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.

పప్పు అన్నంతో పాటు పిండి వంటలు, పండ్లు తినిపిస్తు మొక్కులు చెల్లించుకొన్నారు. పొలం పనులకు ఉపయోగించే వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను, వాహనాలను, ఎడ్లబండ్లను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలతో బొట్టు పెట్టి,


గోవులకు పెట్టేందుకు ధాన్యం, జావ సిద్ధం చేసిన రైతు

పూజలు చేశారు. వ్యవసాయ కూలీలను సత్కరించి వారికి దుస్తులు, నగదును అందజేశారు. పండగ సందర్భంగా ఇంటిల్లిపాది సరదాగా సంతోషంగా గడిపారు. తోటి రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

చింతపల్లి: మండలంలో సంక్రాంతి వేడుకల ఘనంగా జరిగాయి. చౌడుపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురుస్కరించుకొని శ్రీరాములు భజన బృందం ఊరేగింపు నిర్వహించారు. థింసా నృత్యాలు, నేల డాన్సులు, కోలాటం వంటి ఆటపాటలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి.


దుంబ్రిగుడలో ఇంటి ముంగిట సంక్రాంతి ముగ్గులు వేస్తున్న గిరిజన మహిళ


రంపచోడవరంలో గంగిరెద్దుల సందడి


అప్పలరాజుపేటలో ఎడ్ల బండి, జోడెద్దులకు పసుపుకుంకుమలతో పూజలు చేస్తున్న రైతులు

ముగిసిన క్రీడా పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు కాంతారావు, ఈశ్వర్‌బాబు

పాడేరు రూరల్: మండలంలో గురుపల్లి గ్రామంలో సంక్రాంతి వేడుకలో భాగంగా స్థానిక ఉద్యోగులు కాంతరావు, ఈశ్వర్‌బాబుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో వివిద మండలాల నుంచి 10 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానంలో నిలిచిన చింతపల్లి జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి, రెండో స్థానంలో నిలిచిన గురుపల్లి జట్టుకు రూ.5వేలు నగదు బహుమతి అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం ఎంతో ఉత్సాహం కలిగించిందన్నారు. వచ్చే ఏడాది షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు అన్ని రకల క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: సంక్రాంతి సందర్భంగా రేవళ్లలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన బూదరాళ్ల జట్టుకు ప్రథమ బహుమతిని బుధవారం అందజేశారు. రేవళ్ల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. స్థానిక యువకులు ఈ పోటీలను నిర్వహించారు.

రహదారి కోసం గ్రామస్తుల పాదయాత్ర

అరకులోయటౌన్: మండలంలోని మారుమూల బస్కీ పంచాయతీ గిర్లిగుడ నుంచి డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ పరిశీల గ్రామం వరకు తారురోడ్డు, వంతెన నిర్మించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు నేతృత్వంలో బుధవారం గ్రామస్తులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడారు. ఈ మార్గంలో సుమారు నాలుగున్నర కిలోమీటర్లు రహదారి అధ్వానంగా ఉందని, నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కితలంగి పంచాయతీ పరిశీల సమీపంలోని గెడ్డ వద్ద వంతెన నిర్మించాలన్నారు. ఈ రహదారి మీదుగా అనంతగిరి, హుకుంపేట మండలానికి చెందిన పలు గ్రామాల గిరిరైతులు ఈ మార్గం ద్వారా వ్యవసాయ, అటవీ ఉత్పత్తులు వారపు సంతలకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు


సీపీఎం నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తున్న గ్రామస్తులు

పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ కూడా వర్షాకాలంలో రాలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి రహదారి వంతెన నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు కృష్ణ, బలరామ్, గోవర్ధన్, బాలరాజు, డొంబుర్‌దోర్, హరి, ప్రసాద్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


కూనవరం పురవీధిలో చెన్నకేశ్వరస్వామి వారి ఊరేగింపు

కూనవరం: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక చెన్నకేశ్వర స్వామి వారి ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జాము నుంచే భక్తులు శబరి, గోదావరి నదుల సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దూప దీప నైవేద్యం సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారికి హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గడ్డి వాము దగ్ధం


తారువలో దగ్ధమైన గడ్డివాము

దేవరాపల్లి: తారువలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి వాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన బూడి మర్లతల్లినాయుడు కల్లంలో ఈ ప్రమాదం జరిగింది. మర్లమాంబ తీర్థం జరుగుతుండడంతో అక్కడే ఉన్న స్థానికులు వెంటనే మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఈ లోగా చోడవరం అగ్నిమాపక శకటం సిబ్బంది చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి


గంగవరంలో సంక్రాంతి సంబరాల్లో బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్, సర్పంచ్ అక్కమ్మ

గంగవరం: సంక్రాంతి పండగ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ బి.వెంకటేష్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఐక్య కోయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పోటీల్లో విజేతలకు ఎస్‌ఐ వెంకటేష్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఐక్య కోయ చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్లు రాంబాబు, వనిత మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక


పాతగంగవరంలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వైస్ ఎంపీపీ గంగాదేవి, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు దొర తదితరులు

సాయమందిస్తున్నట్టు చెప్పారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ, జనసేన నాయకుడు సిద్దు, గిరిజన వర్ధిక స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ చిన్నారావుదొర, గంగవరం ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు జయకృష్ణ, హెచ్ఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పాత గంగవరంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు , వైస్ ఎంపీపీ కే.గంగాదేవి, గిరి మిత్ర సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముగ్గుల పోటీలు

మోతుగూడెం: మండలంలో సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించారు. పెద్ద పండగ వేడుకల్లో భాగంగా డొంకరాయిలో పోలీసుల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. వివిధ డిజైన్లతో వేసి ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ఆకాశపు వరలక్ష్మి మొదటి బహుమతి, రెండో బహుమతి అంబు రమ్య, మూడోవ బహుమతి పొంగి ప్రియవదన గెలుపొందారు.


విజేతలకు బహుమతులిస్తున్న పోలీసులు

నేడు దండు ముత్యాలమ్మ తీర్థం

కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెంలో గురువారం దండు ముత్యాలమ్మ తీర్థ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పరుగు పందాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పండగ సంత కిటకిట


సంతలో వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారులు


కించుమండ సంతలో దుకాణాల వద్ద గిరిజనులు

దుంబ్రిగుడ: సంక్రాంతి పండుగ కనుమ పురస్కరించుకొని బుధవారం కించుమండ వారపు సంతలో గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంతలో సేర్‌బుడియాలతో సందడి చేశారు. సంతకు వచ్చిన గిరిజనులు తమకు కావలసిన నిత్యావసరాలతో పాటు కోళ్లు, మేకలు ఇతరత్రా సామాగ్రిని గొనుగోలు చేశారు. దీంతో వారపు సంత కిటకిటలాడింది.